రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



సమస్య పరిష్కారం కోసం వచ్చిన బాధితులను

# తిప్పించుకోవద్దు

★ ఏ ఒక్కటీ పెండింగ్‌లో ఉంచకండి ★ ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలి ★ అధికారులకు డీఆర్వో శారదాదేవి ఆదేశం



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న శారదాదేవి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు17, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం 136 ఫిర్యాదులు అందాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి దృష్టికి తీసుకెళ్లి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో శారదాదేవి ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సంబంధిత, రెవెన్యూ, సంక్షేమం, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆమె సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రజలు అందించే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను డీఆర్వో ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సోమవారం అందిన 136 దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 60, ఇతర శాఖలకు సంబంధించినవి 76 ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపించి, వాటిపై తగిన చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకు వచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తోందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు ఉంటే నిక్కచ్చిగా చెప్పండి

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు17, ప్రభాతవార్త:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి తెలిపారు. జిల్లాలోని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ముసాయిదా ఓటరు జాబితాను సిద్ధం చేసి ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అర్హత కలిగిన ప్రతి వ్యక్తి పేరు ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లు లేకుండా పారదర్శకమైన, స్పష్టమైన, తప్పులులేని ఓటరు జాబితాను రూపొందించడమే ఈ సవరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందా లేదా పేరుతో పాటు వయస్సు, లింగం, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా నమోదయ్యాయా లేదా అన్నది ప్రతి అర్హత కలిగిన ఓటరు స్వయంగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. జాబితాలో పేరు లేకపోయినా, ఇప్పటికే నమోదైన వివరాల్లో తప్పులు ఉన్నా, చిరునామా మార్పు, పేరు లేదా ఇతర వివరాల్లో సవరణలు చేయాల్సి ఉన్నా నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ఓటరు జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నట్లు గుర్తించినా, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉన్నా లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నా వాటిని కూడా సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం సెప్టెంబర్ 16, 2026లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, మార్పులు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించాలని స్పష్టం చేశారు.

**జిల్లాలో 24,12,652 మంది ఓటర్లు**

తాజాగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం.. రంగారెడ్డి జిల్లాలోని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 24,12,652 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,12,381 మంది పురుషులు,12,00,062 మంది మహిళలు,209 మంది థర్డ్ జెండర్ ఓటర్లు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య ఇలా ఉంది. 48-ఇబ్రహీంపట్నం 2,59,317 మంది, 49-ఎల్.బి. నగర్ 3,37,919 మంది, 50-మహేశ్వరం 3,39,306 మంది, 51-రాజేంద్రనగర్ 3,88,278 మంది, 52-శేరిలింగంపల్లి 4,43,544 మంది, 53-చేవెళ్ల 2,18,274 మంది, 83-కల్వకుర్తి 2,16,890 మంది, 84-షాద్‌నగర్ 2,09,124 మంది ఓటర్లు ఉన్నారు.

**పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం**

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలోని ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, మరణించిన వ్యక్తులు, అర్హత కోల్పోయిన వారు, ఇతర కారణాలతో అనర్హులైన వారి పేర్లు జాబితాలో కొనసాగకుండా నిబంధనల ప్రకారం పరిశీలన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా విడుదల అనంతరం ప్రజలకు తమ వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పిస్తున్నామని, ఈ దశలో ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, సవరణ దరఖాస్తులు ఎంతో కీలకమని తెలి పారు. అందువల్ల అర్హత కలిగిన ప్రతి ఓటరు బాధ్యతగా ముసాయిదా జాబితాను పరిశీలించి, ఏమైనా లోపాలు ఉంటే నిర్ణీత గడువులోగా అధికారులకు తెలియజేయాలని కోరారు.

**వచ్చే నెల16 వరకూ ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలకు గడువు**
**కలెక్టర్ నారాయణ రెడ్డి**



**నిబంధనల ప్రకారం దరఖాస్తుల పరిశీలన**

ముసాయిదా ఓటరు జాబితాపై సెప్టెంబర్ 16 వరకు అందే క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, మార్పులు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలిస్తారని సి.నారాయణ రెడ్డి తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, అవసరమైన విచారణ అనంతరం అర్హత ఉన్న మార్పులు, సవరణలను నమోదు చేసి తుది ఓటరు జాబితాను రూపొందిస్తామని వెల్లడించారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా ఓటరు జాబితాలో తన పేరు ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హత కలిగిన వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా ఇప్పటికే ఓటరుగా నమోదై ఉన్నవారు కూడా తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని, ఏదైనా తప్పు కనిపించినట్లయితే గడువు ముగిసేలోపు సవరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే మరింత విశ్వసనీయమైన, పారదర్శకమైన, తప్పులులేని తుది ఓటరు జాబితాను రూపొందించగలమని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# సర్వే చేసి చేతులు దులిపేసుకున్నారు

రోడ్డు కబ్జాపై ప్రజావాణిలో అలియాబాద్ గ్రామస్తుల ధ్వజం



మేడ్చల్ ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సమస్యలు మొరపెట్టుకోవటానికి వచ్చిన బాధిత జనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 92 దరఖాస్తులు అందాయి. పలువురు తమ సమస్యలపై అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.

శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ నుంచి అలియాబాద్ గ్రామానికి వెళ్లె రోడ్డు కబ్జా జరిగిందని, గతంలో ఫిర్యాదు ఇస్తే సర్వేయర్ వచ్చి సర్వే చేశారని, కలెక్టర్‌కు రిపోర్టు చేస్తానని తెలిపారని, కబ్జాలో ప్రహారీగోడ ఉన్నందున ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అలియాబాద్ గ్రామానికి చెందిన ఎం.కిష్టప్పతో పాటు పలువురు స్థానికులు ఫిర్యాదు చేశారు.

**సన్నవడ్ల బోనస్ ఇప్పించండయ్యా..**

జిల్లాలో యాసంగి సన్నవడ్లకు సంబంధించి 107మంది రైతులకు బోనస్ అందలేదని, సుమారు 13లక్షల84వేల రూపాయలు బకాయిలు ఉన్నాయని.. వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ముద్దం సంజీవరెడ్డి వినతిపత్రం అందజేశారు.

**హిజ్రాలకూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కావాలి**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తమకూ ఇవ్వాలని జిల్లాకు చెందిన పలువురు హిజ్రాలు హౌజింగ్ పిడికి విజ్ఞప్తిచేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**క్లియరెన్స్ బాధ్యత జిల్లా అధికారులదే..**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రజావాణిపై రాష్ట్ర స్థాయిలో సమీక్షలు జరుగుతున్నందున పెండింగ్‌లో దరఖాస్తులను వెంటనే పరిశీలించి క్లియర్ చేయాలని ఆదేశిచారు. నిర్లక్ష్యం చేస్తే సంబంధిత జిల్లా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసమస్యలు డిసెక్షన్‌కు సంబంధించి 70 దరఖాస్తులు, విద్యాశాఖకు సంబంధించి 46 దరఖాస్తులు, భూసర్వే శాఖకు సంబంధించి 25 దరఖాస్తులు, పింఛన్లకు సంబంధించి డిఆర్‌డిఎ కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున అధికారులు వెంటనే పరిశీలించి వాటి పరిష్కారానికి, క్లియర్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 92 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ ప్రజావాణిలో పలువురు సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో ఉంటే త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు ప్రజల ఫిర్యాదుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. దీనిలో ఎక్కువగా భూ సమస్యలు, డబుల్‌బెడ్‌రూమ్‌లు, పింఛన్లు మంజూరు కోసం, డ్రైనేజీల నిర్మాణాలు, రోడ్లు, త్రాగునీటి సరఫరా, వంటి సమస్యలపై దరఖాస్తులు అందినట్లు తెలిపారు.



వార్త కథనంతో యూనిఫామ్‌లను సరిచేయించి ఇచ్చిన దృశ్యం

## తేడాలు సరిచేస్తున్నాం

**యూనిఫామ్‌ల లోపాలపై అధికారుల దృష్టి**

**వార్త కథనానికి స్పందన**

**దౌల్తాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పంపిణీ చేసిన విద్యార్థుల యూనిఫామ్‌ల సైజుల తేడాలపై వార్త దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఏపీఎం వెంకన్న స్పందించారు. సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకన్న మాట్లాడుతూ...విద్యార్థులకు పంపిణీ చేసిన యూనిఫామ్‌ల విషయంలో దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిచేసి మళ్లీ సరైన పద్ధతిలో కుట్టించి అందజేసేలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని పాఠశాలల్లోనూ నాణ్యమైన, సరిపోయే యూనిఫామ్‌లు అందేలా చూస్తున్నామని తెలిపారు.



పురుగుల బియ్యాన్ని చూపిస్తున్న ఏజెన్సీ కార్మికురాలు

# మధ్యాహ్న భోజనానికి పురుగుల బియ్యం!

**కొడంగల్ జడ్పీ హైస్కూల్‌లో దారుణం**
**రెండు నెలలుగా ఇంతే..**
**ప్రశ్నార్థకంగా విద్యార్థుల ఆరోగ్య భద్రత**

**కొడంగల్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తుందని ఓ పక్క ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పురుగులతో కూడిన బియ్యం నిల్వలు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వహకులు బియ్యం బస్తాలను పరిశీలించగా అందులో తెట్టెలు, పురుగులతో కూడిన బియ్యం ఉండడంతో అవాక్కెయ్యారు. గత రెండు నెలలుగా తమకు సరఫరా అవుతున్న బియ్యంలో పురుగులు వస్తున్నాయని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లామని వంట ఏజెన్సీ నిర్వహకులు తెలిపారు. పురుగుల బియ్యం వండితే విద్యార్థులు అనారోగ్యానికి గురికావడం ఖాయమని నిర్వహకులు వాపోయారు. ఇప్పటికైనా నాణ్యమైన బియ్యం సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

## మెడీ సర్కారుపై యుద్ధానికి 1న చలో ఢిల్లీ

**చేవెళ్ల, అగస్టు 17, ప్రభాతవార్త :** ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వంను గద్దె దించేందుకు చేస్తున్న పోరాటంలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీపీఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం తెలిపారు. సోమవారం చేవెళ్లలో అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు నివాళులర్పించి సీపీఐ ప్రజా చైతన్య యాత్రను >>2

# చిన్నారుల వంటకు కట్టెల పొయ్యే దిక్కు!

**సిలెండర్లు ఇవ్వకుండా గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వేధిస్తున్నారు**
**ప్రజావాణిలో మంబాపూర్ జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం ఆవేదన**

**పెద్దేముల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** గ్యాస్ ఏజెన్సీ నిర్వాహుల నిర్లక్ష్యం కారణంగా సర్కారు పాఠశాలలో మధ్యాహ్న భోజనపథకం నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సిలెండర్లు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపించటం విద్యార్థులకు శాపంగా మారుతోంది. దీంతో మధ్యాహ్న భోజనాన్ని గత్యంతరం కట్టెల పొయ్యిపైనే తయారు చేయాల్సి వస్తోంది. పొగతో విద్యార్థులు, సిబ్బంది సమస్యలు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు గ్యాస్ ఏజెన్సీకి సమస్యను విన్నవించినా పట్టించుకోవడంలేదని పెద్దేముల్ మండలం మంబాపూర్ జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ ఆరోపించారు. విసిగి వేశారిపోయిన హెచ్‌ఎం సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాలకు గ్యాస్ సరఫరా చేయాలని పెద్దేముల్ గ్యాస్ ఏజెన్సీకి విన్నవించినా, గ్యాస్ అందుబాటులో లేదని, ఈకేవైసి కాలేదని, మెయిల్ లేదని ఏదో ఓ కారణం చెబుతున్నారని తెలిపారు. నిబంధన ప్రకారం తాము అన్ని పత్రాలూ సమర్పించినా తమను పట్టించుకోవటంలేదని వాపోయారు. కట్టెల పొయ్యిపై వంట చేయడం వల్ల పక్క తరగతి గదుల విద్యార్థులకు పొగ చూరడం వల్ల కంటి సమస్యలు వచ్చె అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాలకు దాదాపు నెలకు ఆరు సిలిండర్లు అవసరమవుతాయని, గ్యాస్ సరఫరాను సక్రమంగా చేసేలా సంబందిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న చైర్‌పర్సన్

## కాగ్నా నీటి సరఫరాకు రూ.110కోట్లు

**నిధుల మంజూరుకు ప్రభుత్వం జీఓ విడుదల**

**తాండూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :** తాండూరు ప్రజల తాగు నీటి సమస్య శాశ్వత పరిష్కార దిశగా స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మరో కీలక అడుగు వేశారని, తాండూరు కాగ్నా నుండి తాండూరు పట్టణానికి తాగునీటి సరఫరా పథకానికి రూ. 110కోట్లు మంజూరు చేస్తూ జిఓ విడుదల చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. సోమవారం తాండూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేతలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తాండూరు ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాండూరు ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కార దిశగా మరో కీలక అడుగు వేశారని, రూ.110 కోట్లతో తాండూరు పట్టణంతో పాటు యాలాల మండలంలో సుమారు 13 గ్రామలకు శాశ్వత మంచినీటి సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక కృషి చేశారని అన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులను ప్రారంభించి, త్వరితగతిన కాగ్నా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



## హల్ద్వానీ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ ర్యాలీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** హల్ద్వానీ ఘటనను నిరసిస్తూ, ఏఐసీసీ పిలుపు మేరకు వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా నుండి ఎన్నెపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు భారీ మార్చ్ నిర్వహించారు. అనంతరం సత్యాగ్రహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు దారాసింగ్ నాయక్ మాట్లాడుతూ, హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని శుద్ధీకరణ పేరుతో అవమానించడం అత్యంత అవమానకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ముత్తహర్ షరీఫ్, బంట్వారం మండల సీనియర్ నాయకులు శాకం రాములు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ సంఘాలు, విభాగాలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ శ్రేణుల ధర్నా



పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు బాసటగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపిస్తూ జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు సోమవార ఆందోళనకు దిగారు. పలుచోట్ల భారీ ఎత్తున రాస్తారకో, ధర్నా నిర్వహించారు. పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు బాసటగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపిస్తూ జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు సోమవార ఆందోళనకు దిగారు. పలుచోట్ల భారీ ఎత్తున రాస్తారకో, ధర్నా నిర్వహించారు.



ప్రజావాణి లో వినతి పత్రం అందజేస్తున్న బాధితురాలు

# యాచారంలో ప్రారంభమైన ప్రజావాణి

**యాచారం,ఆగస్టు 17, ప్రభాతవార్త:** యాచారం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలనుంచి 3 వినతులు వచ్చినట్లు ఎంపిడిఒ రాధారాణి, తహ శీల్దార్ అయ్యప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల మండల అధికారులు హాజరయ్యారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ముందుగా ఆన లైన్‌లో నమోదు చేసి, వాటి ప్రతిని తహశీల్దార్‌కు అందజేశారు. వచ్చిన వినతులను వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# పల్లెదవాఖానా బాగు చేయండి

**తలకొండపల్లి ఆగస్టు 17, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సీతా రామమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రజావాణికి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో నీ పల్లె దవాఖాన శిథిలావస్థకు చేరుకుందని మరమ్మ తులు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు వినతిపత్రం అందించారు. గ్రామంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన పల్లె దవఖాన శిథిలావస్థ చేరుకోవడంతో ప్రజలకు ఇబ్బంది ఉందని వారు ఫిర్యాదు లో కోరారు.



శిథిలావస్థకు చేరుకున్న పల్లెదవాఖానా బాగు చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు

## కేశంపేటలో తొలిసారి నిర్వహించిన ప్రజావాణి

-అర్జీల ప్రవాహం

**కేశంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త :**
కేశంపేట మండల కేంద్రంలో ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా మొదటిసారిగా అధికారికంగా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ భూ సమస్యలు, పింఛన్లు, ఆసరా దరఖాస్తులు, గ్రామాల్లో మౌలిక వసతుల లేమిపై అధికారులకు 7 అర్జీలు అందజేశారు. క్షేత్రస్థాయి అధికారుల ఈ కార్యక్రమంలో తహసీల్దార్, రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డి, ఎం పి ఓ



ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దయానంద్,తో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు 13 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.
సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిమితులకు లోబడి సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు స్పష్టం చేశారు. హర్షం వ్యక్తం చేసిన ప్రజలు సమస్యల వినతి కోసం ఏళ్ల తరబడి చుట్టూ తిరిగే అవసరం లేకుండా, మండల కేంద్రంలోనే నేరుగా ఫిర్యాదు చేసేందుకు ప్రజావాణి వేదిక కావడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రజావాణిలో అందిన ఒక దరఖాస్తు



పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపిడిఓ పాండు,తహశీల్దారు విజయ్‌కుమార్ తదితరులు

**పూడూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి పాండు,తహశీల్దారు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారంకోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి 25శాఖల అధికారులు హాజరవుతారని వివ రించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ,ఆన్ లైన్‌లో నమోదు చేసిన అనం తరం సమస్య పరిష్కారానికి కృషిచేయ నున్నట్లు వివరించారు. ఈ సంద ర్భంగా మండలపరిధిలోని ఎన్కెపల్లి గ్రామవాసి రెవెన్యూకు చెందిన సమస్య పరిష్కారం కోసం అధికా రులకు దరఖాస్తును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సాయిరెడ్డి, ఎంపిఓ సుందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువలో ప్రజావాణి

తొలిరోజు 9 దరఖాస్తులు..

**మొయినాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభమైంది. ఎంపీడీవో హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి ప్రజావాణికి మొత్తం 9 దరఖాస్తులు అందాయి. గతంలో మండల కేంద్రాలతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి, ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించేవారు. అయితే కొంతకాలంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే ప్రజావాణి నిర్వహించడంతో మండల స్థాయిలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం తిరిగి ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. మొయినాబాద్‌లో నిర్వహించిన తొలి ప్రజావాణికి వచ్చిన 9 దరఖాస్తుల్లో 5 రెవెన్యూ సమస్య లకు, 2 పంచాయతీ రాజ్ శాఖకు, 1 గృహ నిర్మాణ శాఖకు , 1 విద్యుత్ శాఖకు సంబంధించినవిగా ఉన్నాయని ఎంపీడీవో హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని పునఃప్రారం భించిందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించు కోవాలని సూచించారు. అయితే తొలి ప్రజావాణి కార్యక్రమానికి విద్యుత్, ఆర్‌అండ్‌బీ, ఉద్యానవన శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలతో వచ్చిన కొందరు ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ విక్రాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు





విచారణ జరుపుతున్న డిపిఓ

పంచాయతీ కార్యదర్శుల- సర్పంచ్ దాడి

## ఘటనపై విచారణ చేపట్టిన డిపిఓ జయసుధ

**పెద్దేముల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఈ నెల 14న పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కందనెల్లి తాండా సర్పంచ్ ఆనంద్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి సవిత, జయరాంతాండా(ఐ) పంచాయతీ కార్యదర్శి మల్లేశం ఒకరిపై ఒకరు దూషించుకొని దాడి చేసుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసు కోవడంతో ముగ్గురిపై కేసులు నమోదు అయ్యాయి, ఇట్టి విషయమై సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పెద్దేముల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్య దర్శులపై విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులను, సర్పంచ్‌ను వేర్వేరుగా విచారించి, ఇరువైపుల నుంచి వివరాలు,ఆరోపణలు తెలుసుకున్నారు. విచారణ అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని, తదుపరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ తిరుమలస్వామి, యంపిఓ రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దుద్యాల్‌లో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

**దుద్యాల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జిపిఓ పకీరప్ప బీఎల్‌ఓలకు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీఓ సత్యనారాయణ, బీఎల్‌ఓలు యాదమ్మ, రత్నబాయి, వెంకటమ్మతో పాటు రమేష్, హనుమంతు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాను పరిశీలించి, పేర్లు, వివరాల్లో తప్పులు ఉంటే సవరణలు చేసుకోవాలని అధికారులు సూచించారు. అర్హులైన వారు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని తెలిపారు.

## విజయవంతంగా ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

**దుద్యాల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ సంగీత వాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర కంటి ఆసుపత్రి, హైదరాబాద్ వైద్యురాలు భవ్యశ్రీ మరియు బృందం 91 మందికి కంటి పరీక్షలు నిర్వహించింది. అవసరమైన 50 మందికి కళ్లద్దాల కోసం రిఫర్ చేయగా, కంటి శుక్లాలు ఉన్న 8 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి



ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

**దుద్యాల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఏఈ ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ సుస్మిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచిత్ర, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ నర్సింలు, వ్యవసాయ ఏఈఓ సంతోష్‌తో పాటు మొత్తం 15 శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

**బండకుంట తండాలో కొత్త బోరు ఏర్పాటు చేసిన సర్పంచ్**

**నందిగామ, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నందిగామ గ్రామ పంచాయతీ పరిధిలోని 13 వ వార్డు బండాకుంట తండాలో సోమవారం సర్పంచ్ కొమ్ము కృష్ణ కొత్త బోరు మోటర్ ఏర్పాటు చేశారు. బోరు మోటర్ పని చేయక గత కొన్ని రోజులుగా నీళ్లు లేక తండవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 13 వ వార్డ్ సభ్యులు లింగం కోరిక మేరకు స్పందించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ కొత్త బోరు మోటర్ ఏర్పాటు చేసి నీటి కష్టాలు తీర్చారు. ఈ కార్రక్రమంలో గోవింద్ నాయక్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## పిఎసిఎస్ చైర్మన్‌కు ఘన సన్మానం

**నందిగామ, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నందిగామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నియమితులైన కుందారం వెంకటరెడ్డిని సోమవారం నందిగామ గ్రామానికి చెందిన ఆర్ ఆర్ ఆర్ సంస్థల ప్రతినిధి రేగొండ రంజిత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. రైతుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న కుందారం వెంకట రెడ్డిని నియమించడం సరైనదేనని అన్నారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి ని శాలువా వేసి అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుందారం అభిరాం రెడ్డి , రామ యువకులు తదితరులు ఉన్నారు.



పిఎసిఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డిని సన్మానించిన రంజిత్ రెడ్డి

# మేకవనంపల్లి దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఎస్ఐ భరత్ భూషణ్:

**మోమిన్‌పేట్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండలం పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో 15.08.2026, శనివారం అర్ధరాత్రి జరిగిన దొంగతనం కేసును మోమిన్‌పేట్ పోలీసులు ఛేదించారు. లచ్చానాయక్ తండాకు చెందిన విస్లావత్ కిరణ్ అనె యువకుడు జల్సాలకు బానిస అయి ఎలాగైనా డబ్బు సంపాదించాలి అనే ఆశతో దొంగతనం చేయాలనుకోని మెకవనంపల్లిలో అందరూ నిద్రిస్తున్న సమయం చూసి ఒక ఇంట్లోకి చొరబడి బీరువలోని బంగారు, నగలను మరియు 2 సెల్ ఫోన్లను ఎత్తుకెళ్లినాడు. మేకవనంపల్లి గ్రామంలో జరిగిన దొంగతనం ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు మోమిన్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించి, సాంకేతిక అన్వేషణ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన 2, బంగారు ఆభరణాలు, 2, మొబైల్ ఫోన్లు, మొత్తం విలువ సుమారు రూ.2,40,000. రూపాయల చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లుగా పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చురుకుగా పనిచేసిన ఎస్ఐ భరత్ భూషణ్ మరియు సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.



చోరీచేసిన నిందితుడిని అరెస్టు చేసిర రిమాండ్ చేసిన ఎస్ఐ భరత్ భూషణ్.

# అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

: డిఆర్డీఎ అదనపు పీడీ మల్ల సత్యయ్య

**పూడూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని డిఆర్డీఎ అదనపు పీడీ మల్ల సత్యయ్య హెచ్చరించారు. సోమవారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయ సమీపంలోని రైతువేదికలో ఎంపిడిఓ పాండు అద్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకము 17వ విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా టెక్నికల్,ఫీల్డు అసిస్టెంట్లతోపాటు సంబంధిత అధికారులుబాధ్యతవహించాలన్నారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికిగాను మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పనులకోసం ఉపాధికూలీలకు రూ.6.18 కోట్లు,నర్సరీల నిర్వాహణకు రూ.29లక్షలు చెల్లించినట్లు నివేదికలో వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన అవకతవకల్లో బాధ్యులను గుర్తించినట్లు వారినుండి రూ.లక్షా 3వేల 69 రీకవరీ చేయాలని ఆదేశించారు. ఇందులో పెద్దమొత్తం కుత్బుల్లాపూర్‌లో 67934 రూపాయలు ఉండగా,మిగతా డబ్బులు మిగతా గ్రామాల్లో అవకతవకలు జరిగినట్లు వీటిని ఫీల్డు అసిస్టెంట్ల నుండి రీకవరీ చేయాలన్నారు. కడ్మూరు,కెరవెల్లి గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లు,ఫీల్డు అసిస్టెంట్లకు రూ.వేయి చొప్పున పెనాల్టీ విదించారు. ఈ కార్యక్రమంలో డివిఓ కుసుమ మాధురి,అంబుడ్స్‌మెన్ రాములు,ఎపిఓ అశోక్,పూడూరు సర్పంచ్ ఖిజర్‌పాష తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రిని కలిసిన ఉప్పరి మల్లేశం

..సగర (ఉప్పర) ఫెడరేషన్ రాష్ట్ర చైర్మెన్ కోసం వినతి



.సిఎంను కలిసిన ఉప్పరి మల్లేశం

**పెద్దేముల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సగర (ఉప్పర) ఫెడరేషన్ రాష్ట్ర చైర్మెన్ పదవిని ఆశీస్తున్న పెద్దేముల్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి మల్లేశం సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అధ్వర్యంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసారు. సగర (ఉప్పర) సామాజిక వర్గానికి సంబందించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళిన మల్లేశం రాష్ట్ర చైర్మెన్ పదవిని తనకు కేటాయించాలని కోరారు. సామాజిక వర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం తాను కృషిచేస్తానని తెలిపారు. అందుకు ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారని మల్లేశం పేర్కొన్నారు.

# నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ఉప్పల చేయూత

**తలకొండపలి, ఆగస్టు 17 ,ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి మీసాల మైసయ్య ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో సిమెంటు, సికులు పంపిణీ చేశారు. సోమవారం నాడు గ్రామ సర్పంచ్ మల్లేష్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి చెందిన మైసయ్య ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇంటి నిర్మాణం కోసం ఉప్పల ట్రస్ట్ నుంచి ఉచితంగా సీకులు సిమెంటును అందజేశారు. ఈ సందర్భంగా తలకొండపల్లి మాజీ ఎంపీపీ తిరుమని నిర్మల శ్రీశైలం గౌడ్, సర్పంచ్ మల్లేష్ లు మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని నిరుపేదలను ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిరుపేదల కు ఇండ్లు ఉండే విధంగా ఉప్పల ట్రస్ట్ పని చేస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం గౌడ్, సర్పంచ్ మల్లేష్, వార్డు సభ్యులు శేఖర్ గౌడ్, మీసాల మధు మోహన్ రెడ్డి తిరుపతయ్య సుధాకర్ రమేష్ తదితరులు ఉన్నారు.



సిమెంటు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మల్లేష్



సమావేశంలో పాల్గొన్న వరల్డ్ మిషన్ ప్రతినిధులు

## ప్లాస్టిక్ రహిత భారతదేశాన్ని నిర్మించుకుందాం

**మొయినాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ రహిత దేశాన్ని నిర్మించుకుందామని ఏ ఎస్ ఈ జెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దినేష్ కుమార్ ఓబుల్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారము మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏ ఎస్ ఈ జెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వ్యర్ధాలను సక్రమంగా ఉపయోగించు కోవాలని అవగాహన సదస్సును నిర్వహించారు ఈ కార్యక్రమం కళాశాల డీన్ డాక్టర్ పద్మజ. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటాచలం లు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాష దేశము సాంస్కృతులకు అతీతంగా పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమన్నారు స్వయంగా శుభ్రత కార్యక్రమంలో మనందరం పాటించే ప్లాస్టిక్ను దినదినం తగ్గించుకుంటూ వస్తే పూర్తిగా నిర్మించవచ్చునని పేర్కొన్నారు అనంతరం వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ యూనివర్సిటీ విద్యార్థులు పర్యావరణ సంస్థ ఏ ఎస్ ఈ జెడ్ వాలంటీర్లు అవగాహన లో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 175 దేశాల్లో యువతను పర్యావరణ పరిరక్షణ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు పునర్వినియోగ సంచులు బాటిల్లు ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు తమ వంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో వాలంటీర్లు విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.



పైలెట్ రోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

## మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఘనస్వాగతం

..బిఆర్ఎస్ శ్రేణుల్లో వెల్లివిరిసిన నూతనోత్సాహం

**పెద్దేముల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** గత కొంతకాలంగా తాండూరుకు దూరంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సోమవారం తాండూరు పట్టణానికి రావడంతో బిఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. సోమవారం ఆయన రాకను పురస్కరించుకొని పెద్దేముల్ మండలంలోని మన్‌సాన్‌పల్లి, మంబాపూర్ గ్రామాల్లో పైలెట్ రోహిత్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పైలెట్ రోహిత్‌రెడ్డికి పూలమాలలు, శాలువాలతో సత్కరించి భారీ కాన్వాయ్‌తో ఘన స్వాగతం పలికారు. మంబాపూర్‌లో అంబెద్కర్ విగ్రహనికి పైలెట్ రోహిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రాకతో బిఆర్ఎస్‌లో కొత్త ఉత్సాహన్ని నింపిందని రాజకీయ విశ్లేషికులు భావిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి మృతి

**చేవెళ్ల, ఆగస్టు 17, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్‌స్టేజీ సమీపంలో జరిగింది. చేవెళ్ల ఎస్సై తేజస్వినితెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా గండి పేట మండలం నార్సింగ్ లోని మై హోమ్ అవతార్ లో మృతుడు గుడిపూడి హరీష్ (38) నివసిస్తూ సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం కారులో తన సహ ఉద్యోగి ఏలిపాటి కావ్యతో కలసి హైదరాబాద్ నుండి చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని రామన్నగూడ గ్రామానికి వెళ్లుండగా మార్గ మధ్య లోని మల్కాపూర్ గేటు సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. కారును ఏలిపాటి కావ్య నడిపిస్తుదని, ఈ ఘటనలో డ్రైవర్ సీటు పక్కనే కూర్చుని ఉన్న గుడిపూడి హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తలకు, రెండు కాళ్లు, ఛాతి భాగంలో బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కారు నడుతుపున్న ఏలిపాటి కావ్యకు కూడా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన స్థానికులు వెంటనే చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించారు. 108తో అక్కడి చేరుకున్న పోలీసులు గాయాల పాలైన ఇద్దరిని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర రక్త గాయాలు కావడంతో అప్పటికే గుడిపూడి హరీష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు వెల్లడించారు. వైద్యులు కావ్యకు మెరుగైన చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. మృతుని తండ్రి గుడిపూడి వేంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తేజస్విని తెలిపారు .

## ఒప్పంద ఉపాధ్యాయుల ఉద్యోగాలకు ఆహ్వానం

**యాచారం,ఆగస్టు17, ప్రభాతవార్త:**
ఆదర్శ పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రిన్సిపల్ లావణ్య తెలిపారు. యాచారం మండల పరిధిలోని గున్గల్ ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి నుండి ఇంటర్ వరకు బోధించుటకు పీజీటీ జువాలజీ పోస్ట్ ఖాళీగా ఉన్నదని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులు ఎమ్మెస్సీ జువాలజీ పూర్తి చేసి బీఈడీ పూర్తయి ఉండాలని అన్నారు. ఈనెల 20 వరకు మోడల్ స్కూల్ లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు

ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా

## ఎమెస్సీ గ్రాడ్యుయేట్ పట్టా పొందిన మౌనిక

**యాచారం,ఆగస్టు17, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన ఆలంపల్లీ నంసింహ కూతురు మోనిక ఎమెస్సీ గ్రాడ్యుయేట్ పట్ట ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ చేతుల మీదుగా అందుకున్నారు. తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎమెస్సీ బయోలాజికల్ సైన్స్ గార్డ్యుయేషన్ పూర్తి చేసుకొని పట్టా పొందిన ఆమె సంతోషం వ్యక్తం చేశారు. నరసింహ మాట్లాడుతూ.. ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా పట్టా పొందడం సంతోషకరమనీ బంధుమిత్రుడు సంతోషం వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు.



తల్లిదండ్రులతో మౌనిక

## ఎస్ఐఆర్ ముసాయిదా విడుదల



ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తున్న తహసిల్దార్

**కొడంగల్,అగష్టు 17,ప్రభాతవార్త:**
కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్) ముసాయిదా ఓటరు జాబితాను తహశీల్దార్ రాంబాబు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 284 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,11,540 ఓటర్లు ఉన్నట్లు తహశీల్దార్ రాంబాబు, డీటీ అనిత తెలిపారు. ఎస్ఐఆర్‌కు ముందు నియోజకవర్గంలో 2,51,255 మంది ఓటర్లు ఉండగా అందులో మరణించిన వారు 9146, షిఫ్టింగ్ 16,986, డబుల్ ఓటర్లు 10,182 ఇతరులు 3,400 ఓట్లు తొలగించే అవకాశం ఉంది, ఎస్ఐఆర్ సర్వే వల్ల 39,715 ఓట్లు కోతకు గురయ్యాయి.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి ఆగస్టు 17 ,ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన కావాలి రాములు అనారోగ్యానికి గురై మృతి చెందాడు. సోమవారం నాడు మృతుని కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి ధర మొత్తం కుటుంబ సభ్యులకు 4000రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్ నాగేష్ సత్యనారాయణ గౌడ్ జవాజ్ రామకుండా బోరి ఆనంద్ కాల్ పాపయ్య శేఖర్ బైరపాలక మార్కండేయ మల్లేష్ మహేష్ శేఖర్ భీమయ్య నాయకులు మహేష్ నాగేష్ సత్యనారాయణ గౌడ్ జవాజ్ రామకుండా బోరి ఆనంద్ కాల్ పాపయ్య శేఖర్ బైరపాలక మార్కండేయ మల్లేష్ మహేష్ శేఖర్ భీమయ్య తదితరులున్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు



## న్యూ అంబేడ్కర్ నగర్ కాలనీ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షుడిగా కె.శ్రావణ్ కుమార్**

**జవహర్ నగర్, ఆగస్టు17, ప్రభాతవార్త:**

మేడ్చల్ మల్కాజగిరి మున్సిపల్ కార్పోరేషన్ కీసర సర్కిల్, జవహర్ నగర్ డివిజన్‌లో ఉన్న న్యూ అంబెడ్కర్ నగర్ కాలని నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు కాలనీ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కె.శ్రావణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడుగా కూతడి సాయి కుమార్, ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి భాస్కర్, ఎన్నికయ్యారు, ఉపాధ్యక్షులుగా మారయ్య, మంద స్వామి, మేడ రమ, శ్రీదేవి, కోశాధికారిగా టీ. భాస్కర్, సంయుక్త కార్యదర్శులుగాకాళిదాస్, నరసింహ ఎన్నికయ్యారు. సలహాదారులుగా యాదగిరిరావు, రామాకృష్ణ, శ్రీనివాస్‌రావు, వెంకటెష్‌లను ఎన్నుకున్నారు. కార్యావర్గ సభ్యులుగా నాగారాజు, శంకర్, రేవతి, రాణీ, మంజుల, లలిత, చిలుక నిర్మల, శంకర్ యాదవ్, భాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు కె.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ. కాలనిలో నెలకోన్న సమస్యలను పరిష్కరించేందుకు,

మౌలిక వసతులు మెరుగుపరిచెందుకు నిరంతరం కృషీ చెస్తామని తెలిపారు. కాలని వాసుల సమస్యలను సంబధిత అధికారుల దృష్టీకి తీసుకెళ్లి పరిష్కారానికి కృషీ చెస్తామన్నరు. తమపై నమ్మకంతో ఏకగ్రవంగా ఎన్నుకున్న కాలని వాసులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థికి ట్రై సైకిల్ అందజేస్తున్న టీవీవీ నాయకులు

## విద్యార్థికి ట్రై సైకిల్ అందజేత

**కొడంగల్, ఆగష్టు 17, ప్రభాతవార్త:**

కిసాన్ బంద్ సతీష్ స్నేహ వారి సహకారంతో తెలంగాణా విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సోమవారం కొడంగల్ పట్టణంలోని ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అంగవైకల్యం కలిగిన శ్రీహర్షకు ట్రై సైకిల్‌తోపాటు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కొండారెడ్డిపల్లి నుంచి పాఠశాలకు ప్రతిరోజు రాకపోకలు సాగించేందుకు శ్రీహర్ష ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన విద్యావంతుల వేదిక ప్రతినిధులు, దాత సహకారంతో ఈ ట్రై సైకిల్‌ను అందజేశారు. విద్యార్థి విద్యాభ్యాసానికి ఎలాంటి అటంకం కలగకుండా అతని రాకపోకలు సులభతరం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ అవసరంలో ఉన్న విద్యార్థులకు చేయూతనందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థుల్లో అత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీహర్ష విద్యాభ్యాసంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, మండల విద్యాధికారి రాంరెడ్డి, టీవీవీ జిల్లా ప్రదాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్. ప్రోగ్రాం కన్వీనర్ గౌరారం గోపాల్, కార్యదర్శి పల్నాటి అనిల్‌కుమార్, స్దానిక పాఠశాల ఉపాధ్యాయులు ఆనంద్‌రావు, రాములు, కరుణాకర్, బసప్ప, నరసింహులు, అమ్మనాన్న ఫౌండేషన్ నిర్వహకులు ప్రవీణ్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్, నారాయణపేట్ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సహకరించడం అభినందనీయం

**మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్**



రైతులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

**కొడంగల్, అగష్టు 17, ప్రభాతవార్త:** కొడంగల్, నారాయణపేట్ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సహకరించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు. గ్రావిటీ కెనాల్=2 కోసం భూములు ఇచ్చిన రైతులకు సోమవారం సానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మేన్ ఘనంగా సన్మానించారు. మక్తల్, నారాయణపేట్, కొడంగల్ ఎత్తిపోతల నీటిపారుదల పథకంలో భాగంగా దౌల్తాబాద్ చెరువు నుంచి కొడంగల్ లిఫ్ట్ వరకు చేపట్టనున్న గ్రావిటీ కెనాల్=2 నిర్మానానికి కొడంగల్ పట్టణానికి చెందిన రైతులు సహకారం అందించారు. కెనాల్ నిర్మాణం కోసం అవసరమైన మొత్తం 27 ఎకరాల 27 గుంటల భూమిని ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేకుండా సహృదయంతో అంగీకరించి, సంభందిత పత్రాలపై సంతకాలు చేసిన రైతులను మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, తహశీల్దార్ రాంబాబు సన్మా నించారు. ఈ సందర్బంగా రైతులకు స్వీట్లు తినిపించి వారి సహకారాన్ని అభినందించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు స్వచ్ఛంధంగా సహకరించడం అభినందనీయమని, వారి త్యాగం భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారికి తగిన నష్టపరిహారం ప్రభుత్వంచే వారికి అందేలా కృషి చేస్తానని మున్సిపల్ చైర్మేన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఅప్షన్ సభ్యులు రమేష్‌బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అసీఫ్‌ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీవారి ఆలయ నిర్మాణంలో నిర్వసితులకు చెక్కుల పంపిణీ :** కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణంలో ఇళ్ళు కోల్పోయిన నిర్వసితులకు చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం స్దానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ నిర్మాణంలో ఇళ్ళను కోల్పోయిన వారికి పెండింగ్‌లో ఉన్న చెక్కులను మున్సిపలన చైర్మేన్ నందారం ప్రశాంత్ అందించారు

## నేడు యాచారంలో ఎమ్మెల్యే పర్యటన

**యాచారం, ఆగష్టు 17, ప్రభాతవార్త:**

నేడు యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగ రెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీవో రాధారని ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం విలేకరులతో ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి , కేష్లి తండా నల్లవెల్లి, తమ్మలోని గూడ, చౌదరి పల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులపై శంకుస్థాపనల కార్యక్రమాలకు ఎమ్మెల్యే విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు సమయపాలన పాటించి హాజరుకావాలని కోరారు.

# పేదల బంధువు పండుగ సాయన్న

**కేశంపేట మండల కేంద్రంలో పండుగొల్ల విగ్రహావిష్కరణకు భూమి పూజ**

**కేశంపేట, ఆగష్టు 17, ప్రభాతవార్త :**

కేశంపేట మండల కేంద్రంలో అమరవీరుడు, పేదల బంధువు పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన భూమి పూజ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు మండల స్థాయి నాయకులు, వివిధ వర్గాల ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై పేదల సంక్షేమం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడు పండుగొల్ల సాయన్న అని కొనియాడారు. నాటి రోజుల్లోనే ధనికుల నుంచి దోచి పేదలకు పంచిపెడుతూ ప్రజల గుండెల్లో ఖిఖితెలంగాణ రాబిన్ హుడ్ఖిఖిగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. కేశంపేట మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా రాబోయే తరాలకు ఆయన త్యాగాలు, సేవలు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.

త్వరలోనే విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని బహుజనులు, ప్రజల సమక్షంలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు అందె బాబయ్య ముదిరాజ్ , ముదిరాజ్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలికే ఆంజనేయులు ముదిరాజ్, అంచ రాములు ముదిరాజ్ కుడుముల బాలరాజు ముదిరాజ్, శ్రీధర్ వర్మ ముదిరాజ్, సంతోష్ ముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్, రావుల పెంటయ్య ముదిరాజ్, లాలమోని చంద్రయ్య ముదిరాజ్, తుమ్మల గోపాల్ ముదిరాజ్, కడియాల ఆంజనేయులు ముదిరాజ్, కృష్ణయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షుడు వీరమోని రమేష్ ముదిరాజ్, పోలేమో సతీష్ ముదిరాజ్,



పండుగ సాయన్న విగ్రహా ఏర్పాటు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు

రమేష్ ముదిరాజ్, నర్సింలు ముదిరాజ్, వెంకటయ్య ముదిరాజ్, బాలరాజ్, ముదిరాజ్, సాయిలు ముదిరాజ్, బాలు ముదిరాజ్, నియోజకవర్గ నాయకులు, స్థానిక యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పండుగొల్ల సాయన్న గురించి ప్రముఖ విశ్లేషకులు ముఖ్య విశేషాలు గురించి మాట్లాడుతూ

సామాజిక పోరాటయోధుడు పండుగ సాయన్న (సాంబయ్య) తెలంగాణ ప్రాంతంలో పేదల హక్కుల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ శక్తి. పేదల పెన్నిధి ధనవంతులు, భూస్వాముల వద్ద ఉన్న అక్రమ సంపదను దొంగిలించి, ఆకలితో అలమటించే పేదలకు పంచిపెట్టిన దయాగుణం కలిగిన వ్యక్తి.

ప్రజా అభిమానం ఆయన చూపిన ధైర్యం, పేదల పట్ల ఉన్న ప్రేమ కారణంగా నిజాం కాలంలోనే ప్రజలు ఆయనను తమ సొంత మనిషిగా ఆరాధించారు తెలిపారు.

# రంగనాయకస్వామికి ఎమ్మెల్యే వెంకటేశ్ పూజలు

**ఘట్‌కేసర్, ఆగష్టు 17, ప్రభాతవార్త:** ప్రాచీన గోదారంగనాయకస్వామి దేవాలయానికి ఎంతో ఘన చరిత్ర ఉందని అంబర్‌పేట్ శాసనసభ్యులు కాలేరు వెంకటేశ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో సోమవారం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీగోదాసమేత మన్నార్‌రంగనాయకస్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడ పంచమి సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి స్వామి, గోదాదేవి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు అర్చన చేసి ఎమ్మెల్యే వెంకటేశ్‌కి సన్మానించి ఆశీర్వచనం అందించారు. ఈకార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు-కీసరగుట్ట డైరక్టర్ సామల అమరేందర్, సహకార సంఘం డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డైరక్టర్



రంగనాయకస్వామిని దర్శించుకున్న అంబర్‌పేట్ ఎమ్మెల్యే వెంకటేశ్



ఆలయంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

గాయరు విశ్వనాథం, మాజీ వార్డుసభ్యులు మెట్టు రమేశ్, నాయకులు ఎమ్మెల్యే తనయుడు కాలేరు దిలీప్, మెట్టు నర్సింహ్మా, బట్టె లక్ష్మణ్‌రావు, సామల నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి, శ్రద్ధలతో నాగులపంచమి



నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

**ఘట్‌కేసర్, ఆగష్టు 17, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో సోమవారం నాగులచవితి పర్వదినాన్ని భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసంలో నాగుల చవితి, పంచమి సందర్భంగా మహిళలు నాగదేవతను భక్తితో కొలిచారు. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, కొండాపూర్, ఎన్ఎఫ్‌సినగర్, ఎదులాబాద్, అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం, ఘణాపూర్, మర్రిపల్లిగూడ తదితర చోట్ల మహిళలు పుట్టకు ఆవు పాలు పోశారు. పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఎదులాబాద్ శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి ఆలయంలో నాగదేవతకు భక్తులు పూజలు జరిపారు. అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య ఆలయ ధర్మకర్తలు కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో నాగ పూజలు చేశారు. వంజరిబస్తీలోని నాగదేవత ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్‌లో, లింగాలకుంట, జంట నాగుల విగ్రహాలకు పూలు, పళ్లు, నైవేద్యం సమర్పించారు. ఘట్‌కేసర్ పట్టణంలో ఆవుపాలు, పూలు, పండ్లు, కొబ్బరికాయల విక్రయాలు జోరుగా జరిగాయి.

# కళ్యాణలక్ష్మీ,షాదీముబారక్ పథకాలను అమలు చేయాలి

**డిప్యూటీ తహశీల్దార్‌కు బిఆర్ఎస్ నాయకుల వినతి**

**కొడంగల్, అగష్టు 17, ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవ ఆర్దిక భరోసా పథకాలైన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ అద్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. సోమవారం కొడంగల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల కమిట అద్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ వాణిశ్రీమధు సూదన్ యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, ఎర్రన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ఆర్దిక భరోసా పథకాలైన కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ పథకాలకు చట్టబద్దత కల్పించి వెంటనే అమలు చేయాలని 2014 ఆక్టోబర్ 2న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కొనసాగించాలని ఇచ్చిన హమీలను అమలు చేయకుండా ఆడబిడ్డలకు తులం బంగారం విషఆన్ని పక్కదారి పట్టించడానికి హైకోర్టులో కేసు వేయించి ఈ పథకాలను రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ పథకాలను వెంటనే అమలు చేయాలని లేపిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

అద్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించడానికి వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీజీ కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, నవాజ్, మధుసదన్‌రెడ్డి, మల్లేష్, శివకుమార్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులురవీంద్రచారీ, వెంకట్, చిన్నయ్య, మంగళి శేఖర్, రాజశేఖర్ , హనుమంతు, శివరాజ్, హకీం, రాఘవేందర్‌రెడ్డి, శరణప్ప, పరమేష్, అమ్మిభాయ్, కాశమ్మ, అంజమ్మ, మధు, చింటూ, రవి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి పథకాలు రద్దుచేస్తే రణరంగమే



చేవెళ్ల ఆర్డీఓ కార్యలయం ముందు దర్నా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**చేవెళ్ల, అగష్టు 17, ప్రభాతవార్త :** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రద్దు చేస్తే రణరంగమే సృష్టిస్తామని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణా రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రద్దుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీఓ కార్యాలయాల ముందు చేస్తున్న నిరసనలో భాగంగా సోమవారం చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయం ముందు దర్నా చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యాధావిదిగా కొనసాగించాలని కోరుతూ చేవెళ్ల ఆర్డీఓ పార్ధ సింహా రెడ్డికిబీఆర్ఎస్ శ్రేణులు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు బీజాపూర్ హైదరాబాద్ అంతర్ రాష్ట్ర రహదారి నుంచి ర్యాలీగా తరలి వెళ్లి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి బైఠాయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మల్లారి విజయభాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేశమల్ల ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, సీనియర్ నాయకులు మిట్ట వెంకట రంగారెడ్డి, బేగరి అనిల్, రామాగౌడ్, అశోక్, రాములు గౌడ్, శేరి రాజు, మాణిక్య రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, చల్మా రెడ్డి, కనక మామిడి మల్లా రెడ్డి, నత్తి క్రిష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, చాకలి క్రిష్ణ, జాహెద్, ఆనంద్, బాబు, శంకరయ్య, అనంతరెడ్డి, సిద్ది బాలు, మద్దేల నానీ, కరుణాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కసిరే వెంకటేష్, శేరి శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలి

**మొయినాబాద్, ఆగష్టు 17, ప్రభాతవార్త :**

బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మహేశ్వరం నియోజకవర్గ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో



నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంత రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ గారి హయాంలో పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ పథకానికి సంబంధించి హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం సరైన సమయంలో కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నించేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సురంగల్ కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ మాజీ సర్పంచ్ నరోత్తం రెడ్డి మాజీ సర్పంచ్ సుధాకర్ యాదవ్, , ప్రవీణ్ చిల్కూర్ దర్శన్ పరమేష్ బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



.ప్రజావాణీలో దరఖాస్తు తీసుకుంటున్న ఎంపీడీఓ

## ప్రజావాణికి 5 దరఖాస్తులు

**మర్పల్లి, ఆగష్టు 17, ప్రభాతవార్త:** మండల కేద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణీకి 5 భూ సమస్య ధరఖాస్తులు అందాయని ఎంపిడిఓ శాంత తెలిపారు. వచ్చిన ధరఖాస్తులను సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖకు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారని ఆమె తెలిపారు.

**భూ సమస్యలను పరిష్కరించాండిః** మర్పల్లి మండలంలోని వివిధ గ్రామాలలో భూ సమస్యలు నెల కొన్నాయని రైతులు కార్యాలయాల చుట్టు తిరిగి వేసారి పోతున్న పరిష్కారం కావడం లేదని వెంటనే భూ సమస్యలను పరిష్కరించాలని కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ ఫిల్డు కో ఆర్డీనేటర్ అమరేశ్వర్ అన్నారు. దరఖాస్తులు చేసుకొని ఏండ్లు గడుస్తున్నా భూ సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా మారిందని రెవెన్యూ అధికారులు స్పందించి భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణీలో మండల ప్రత్యేకాధికారికి ధరఖాస్తు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

## నిషేధిత జాబితా నుండి మా భూములను తొలగించండి

**రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌కు కొర్రెముల గ్రామస్తుల వినతి**



తమ భూములను నిషేధిత జబితా 22ఏ నుండి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజ్యసభ ఎంపీ కె. లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొర్రెముల గ్రామస్తులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఆగష్టు 17, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ కొర్రెముల గ్రామానికి చెందిన నిరుపేద రైతుల భూములను నిషేధిత జాబితా 22ఏ లో ప్రభుత్వం పెట్టడం అన్యాయమని తమకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ రాజ్యసభ ఎంపీ కె. లక్ష్మణ్‌ను బాధితులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కొర్రెముల రెవెన్యూ సర్వేనెంబరు 873లోని భూములు బండి లలిత, బండి స్వామి, బి. ఆంజనేయులు, పి. రాములమ్మ, కొప్పుల నర్సింగ్‌రావు తదితరులకు చెందిన భూముల విషయమై ఘట్‌కేసర్‌కు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేకల నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఎంపీ కె. లక్ష్మణ్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీదల భూములపై కన్నేసి నిషేధిత జబితాలో పెట్టడం సరికాదని వెంటనే నిషేధిత జబితా 22ఏ లో నుండి తమ భూములను తొలగించి తమకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీద బడుగు బలహీన వర్గాల సమస్యలపై పోరాడుతున్న మేకల నర్సింగ్‌రావును అభినందిస్తూ కొర్రెముల రైతులకు న్యాయం జరిగేవిధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులను వెంటనే అందజేయాలి

**బిఆర్ఎస్ నేతల ధర్నా**



మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**మేడ్చల్, ఆగష్టు 17, ప్రభాతవార్త :** పేద ఆడబిడ్డల పెండ్లికి ఆర్థిక సహాయం అందజేసేందుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మేడ్చల్ బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను వెంటనే అందజేయాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ తహసిల్దార్ కార్యాలయం ఎదుట మేడ్చల్ డివిజన్, ఎల్లంపేట మున్సిపల్ బిఆర్ఎస్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ అందించిన పథకాలను తొలగించాలని కాంగ్రెస్ నాయకులు కుట్రకుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కోర్టులో పిటిషన్ వేయించి కళ్యాణలక్ష్మీ పథకాన్ని నిర్వీర్యం చేసి రద్దు చేయడానికి పూనుకున్నదని అన్నారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లికి లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని, వెంటనే అర్హులైన లబ్దిదారులకు పథకం చెక్కులను అందజేయాలని డిమాండ్ చేశారు.

## షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

**మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి**

**పరిగి టౌన్ ఆగష్టు17, ప్రభాతవార్త :**

కల్యాణ లక్షి ్మ షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయొద్దని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం పరిగి పట్టణంలోని బస్టాండ్ వద్ద బిఆర్ఎస్ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని రూ. 51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారుఅయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసే ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కళ్యాణ లక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారనిచాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరవింద్ రావు సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మోత్కూర్ మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్ కౌన్సిలర్లు వారాల రవీంద్ర జేఏసీ రవి. భాస్కర్ .ఆంజనేయులు. రాఘవపూర్ మాజీ సర్పంచ్ జగన్. హనుమంత్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపి టిసిలు తది తరులు పెద్ద ఎత్తున పా ల్గొన్నారు.

